# సాక్షి వరంగల్

సోమవారం | 27 | మే | 2024




**ప్రేమ విఫలమై..మనసు ముక్కలై..**

క్షణికావేశంలో కొందరు.. ఆలోచన లేక మరి కొందరు.. సరైన సూచనలు అందక ఇంకొంద రు..ఇలా ఇరవై ఏళ్లు నిండని యువకులు బల వన్మరణాలకు పాల్పడుతున్నారు. - 8లో▸



**ఘరానా మోసం..**

మంగపేట మండలంలోని రాజుపేట కెనరా బ్యాంక్‌లో ఘరానామోసం జరిగింది. వినియో గదారులు కుదువపెట్టిన బంగారంతో బ్యాంక్ గోల్డ్ అప్రైజర్ పరారయ్యాడు. - 8లో▸

గరిష్టం/కనిష్టం
$43^0$ /$32^0$

**వాతావరణం**

జిల్లాలో ఉదయం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. మధ్యాహ్నం ఎండతోపాటు ఉక్క పోత ఎక్కువగా ఉంటుంది. రాత్రి సమయం లో ఆహ్లాదకరంగా ఉంటుంది.

## న్యూస్‌రీల్

### వేయిస్తంభాల ఆలయంలో సంకటహర చతుర్థి పూజలు



**హన్మకొండ కల్చరల్:** హనుమకొండలోని వేయి స్తంభాల ఆలయంలో సంకటహర చతుర్థిని పురస్కరించుకుని గణపతికి ప్రత్యేక పూజలు జరిపారు. ఆదివారం సాయంత్రం ఆలయ ప్రధానార్చకుడు గంగు ఉపేంద్రశర్మ ఆధ్వర్యం లో అర్చకులు ప్రణవ్, సందీప్‌శర్మ దేవాలయం లోని మూల మహాగణపతికి ధాన్యం ఆవాహన ఆసనం నిర్వహించి మామిడిపండ్ల రసంతో అభిషేకం, క్షీరాభిషేకం, సుగంధ ద్రవ్యాలతో, కుంకుమ విలేపనాలతో అభిషేకం నిర్వహిం చారు. గరిక పూజ చేసి నీరాజన మంత్రపుష్పం జరిపారు. గంగు ఉపేంద్రశర్మ మాట్లాడుతూ.. సంకట చతుర్థి రోజున విఘ్నేశ్వరుడికి పూజలు నిర్వహించడం వల్ల విఘ్నాలు తొలగిపోయి, సర్వశుభాలు కలుగుతాయన్నారు.

### నేటి ప్రజావాణి రద్దు

**కాశోజీ సెంటర్ :** కలెక్టరేట్ సమావేశ మందిరం లో సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్ర మాన్ని రద్దు చేసినట్లు కలెక్టర్ పి.ప్రావీణ్య ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అధికారు లు, సిబ్బంది పట్టభద్రుల ఉపఎన్నిక విధుల్లో నిమగ్నమై ఉన్నందున రద్దు చేసినట్లు పేర్కొ న్నారు. ఈ విషయాన్ని ప్రజలు గమనించి ఫిర్యాదులు ఇచ్చేందుకు కలెక్టరేట్‌కు రావొద్దని ఆమె కోరారు.

**గ్రేటర్ గ్రీవెన్స్..**

**వరంగల్ అర్బన్:** వరంగల్ మహా నగర పాలక సంస్థ (జీడబ్ల్యూఎంసీ) ప్రధాన కార్యాలయం లో గ్రీవెన్స్ సెల్ సోమవారం (రద్దు) చేసినట్లు కమిషనర్ అశ్విని తానాజీ వాకడే తెలిపారు. ఈమేరకు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పట్టభ ద్రుల ఉప ఎన్నికలో సిబ్బంది, అధికారులు నిమగ్నమైనందున, పరిపాలనాపరమైన కార ణాల దృష్ట్యా కార్యక్రమాన్ని రద్దు చేస్తున్నట్లు తెలిపారు. మహా నగర ప్రజలు గ్రీవెన్స్ సెల్‌కు రావొద్దని ఆమె విజ్ఞప్తి చేశారు.


### యువతి అదృశ్యం

**నల్లబెల్లి:** యువతి అదృశ్యమైన సంఘటన గొల్లపల్లి గ్రామంలో జరిగింది. ఎస్సై రామా రావు కథనం ప్రకారం.. గొల్లపల్లి గ్రామానికి చెందిన పనికర సారయ్య కుమార్తె మమత ఈ నెల 20న ఉదయం నర్సంపేటకు వెళ్లి డ్రెస్‌లు కొనుక్కొని వస్తానని తండ్రికి చెప్పి ఇంటి నుం చి వెళ్లిపోయింది. ఆ రోజు రాత్రివరకు తిరిగి ఇంటికి రాలేదు. పలుమార్లు ఫోన్‌చేయగా లిఫ్ట్ చేయలేదు. దీంతో ఆందోళనకు గురైన సారయ్య బంధువులు, స్నేహితుల ఇళ్లలో గాలించినా మమత ఆచూకీ తెలియలేదు. నర్సంపేటలోని సర్వాపురం గ్రామానికి చెందిన పవన్ తన కుమార్తెను తీసుకెళ్లాడని అను మానం వ్యక్తం చేస్తూ ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

### నేడు నీటి సరఫరా బంద్

**వరంగల్ అర్బన్:** వరంగల్ పోతననగర్ వద్ద 800 ఎం.ఎం డయా పైప్‌లైన్ వద్ద లీకేజీ మర మ్మతులు కొనసాగుతున్నందున పలు ప్రాం తాలకు నీటి సరఫరా ఉండదని బల్దియా ఈఈ రాజయ్య ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం(నేడు) కేఎంసీ వాటర్ ట్యాంక్ పరిధి రంగంపేట, పోతన కళాక్షేత్రం, పోతనన గర్, గణేశ్‌నగర్, రాజీవ్ కాలనీ, మట్టెవాడ వాటర్ ట్యాంక్ పరిధి రామన్నపేట, పాపయ్య పేట, ఓ ఎస్‌నగర్, రఘునాథ్ కాలనీ నీటి సర ఫరా జరగదని తెలిపారు. అంతేకాకుండా రీజినల్ కంటి ఆస్పత్రి ప్రాంతంలోని వాటర్ ట్యాంక్ పరిధి ప్రాంతాలు, గాయత్రి ఆలయ సమీపంలోని వాటర్ ట్యాంక్ పరిధి ప్రాంతాల్లో నీటి సరఫరా ఉండదని ఆయా ప్రాంతాల ప్రజలు సహకరించాలని కోరారు.

### మద్యం అమ్ముతున్న మహిళల అరెస్ట్



**రామన్నపేట:** ఎలక్షన్ కోడ్ అమల్లో ఉండగా.. బెల్ట్ షాప్ నడుపుతున్న కాశిబుగ్గ ప్రాంతానికి చెందిన అంగిడే కరుణ, తేజావత్ శారదను ఇం తేజార్‌గంజ్ ఇన్‌స్పెక్టర్ మచ్చ శివకుమార్ అరె స్ట్ చేశారు. సులభంగా డబ్బు సంపాదించేం దుకు వారి ఇంటి ఎదుట అధిక ధరలకు అక్ర మంగా మద్యం విక్రయిస్తున్నారని పోలీసులకు సమాచారం అందింది. ఆదివారం ఎస్సై బి.వెం కన్న సిబ్బందితో కలిసి తనిఖీ చేయగా.. వారి వద్ద నుంచి సుమారు రూ.38,250 విలువైన 236 బీర్లు స్వాధీనం చేసుకున్నారు.ఎవరైనా బెల్ట్‌షాపులు నిర్వహిస్తూ మద్యం అమ్మితే చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకుంటామని ఇన్ స్పెక్టర్ శివకుమార్ హెచ్చరించారు.

# ఓటేద్దాం రండి!

సాక్షిప్రతినిధి, వరంగల్:

ఉమ్మడి వరంగల్, ఖమ్మం, నల్లగొండ జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నిక పోలిం గ్‌కు అంతా సిద్ధమైంది. సోమవారం ఉదయం 8 నుంచి సాయంత్రం 4 గంటల వరకు ప్రశాంత వాతావరణంలో పోలింగ్ జరిగేలా ఎన్నికల అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. ఉమ్మడి వరం గల్ జిల్లా వ్యాప్తంగా పోలింగ్ కేంద్రాల్లో ఎలాంటి సమస్యలు ఉత్పన్నం కాకుండా ఎన్నికల రిటర్నింగ్ అధికారి, వరంగల్ కలెక్టర్ అధికారి పి.ప్రావీణ్య, హనుమకొండ, మహబూబాబాద్, ములుగు, జన గామ, జయశంకర్ భూపాలపల్లి జిల్లాల కలెక్టర్లు, ఎన్నికల అధికారులు పకడ్బందీ చర్యలు తీసుకు న్నారు. పోలింగ్ సందర్భంగా అల్లర్లు, అవాంఛనీ య సంఘటనలకు తావులేకుండా వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్‌ఝా, ఆయా జిల్లాల ఎస్పీ లు కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేశారు. పోలిం గ్ కేంద్రాల వద్ద 144 సెక్షన్‌తోపాటు నిషేధాజ్ఞలను అమల్లోకి తెచ్చారు.

**నేడే ఉప ఎన్నిక సమరం..**
**ఎవరిదో చివరకు విజయం..**

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నికలో 52 మంది అభ్యర్థులు బరిలో ఉన్నారు. ప్రధానంగా ఏనుగుల రాకేశ్‌రెడ్డి (బీఆర్ఎస్), తీన్మార్ మల్లన్న (కాంగ్రెస్), గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి (బీజేపీ) మధ్య పోటీ నెల కొంది. ఈ మూడు పార్టీలకు కూడా పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉపఎన్నిక ప్రతిష్టాత్మకంగా మారగా.. ఆయా పార్టీల నాయకులు అభ్యర్థుల గెలుపు కోసం సర్వశక్తులొడ్డారు. వరుసగా గెలుస్తూ వస్తున్న బీఆర్ ఎస్‌కు ఈసారి మరీ సవాల్‌గా మారింది. ఎమ్మెల్యే గా ఎన్నికైన పల్లా రాజేశ్వర్‌రెడ్డి పదవికి రాజీనామా చేయడంతో ఏర్పడిన ఉప ఎన్నికలో ప్రస్తుత పరిస్థి తుల్లో గెలుపు ప్రతిష్టాత్మకంగా మారింది. బీజేపీ నుంచి బీఆర్ఎస్‌లో చేరిన ఏనుగుల రాకేశ్‌రెడ్డిని తమ అభ్యర్థిగా నిలిపిన బీఆర్ఎస్.. ఆ పార్టీ ఓటు బ్యాంకుతో పాటు రాకేశ్‌రెడ్డికి ఉన్న పూర్వ పరిచ యాలతో బీజేపీ ఓటు కూడా తమ వైపు మొగ్గు చూపుతుందని అంచనా వేస్తున్నారు. రాష్ట్రంలో కాం గ్రెస్ అధికారంలో ఉన్నా.. శాసనమండలిలో మెజారిటీ లేకపోవడంతో ప్రతి ఎమ్మెల్సీ ఎన్నిక ఆ పార్టీకి కూడా సవాల్‌గా మారింది. గత ఎన్నికల్లో స్వతంత్ర అభ్యర్థిగా బరిలో దిగిన తీన్మార్ మల్లన్న ద్వితీయ స్థానంలో నిలవడంతో ఈసారి కాంగ్రెస్ తన అభ్యర్థిగా ఆయననే బరిలోకి దించింది. గత ఎన్నికల్లో మూడో స్థానంలో నిలిచిన ప్రొఫెసర్ కోదండరాం నేతృత్వంలోని టీజేఎస్‌తో పాటు సీపీఐ, సీపీఎం కూడా కాంగ్రెస్ అభ్యర్థికి మద్దతు ప్రకటిస్తుండటం.. కాంగ్రెస్‌కు చెందినవారే ఎక్కువ మంది ఉండటంతో ఆ పార్టీ నేతలు గెలుపు ధీమా లో ఉన్నారు. బీజేపీ అభ్యర్థి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి గెలుపు బీజేపీ ఈసారి చాలెంజ్‌గా తీసుకుని ప్రచారం కోసం అగ్ర నేతలను రంగంలోకి దింపింది. పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, ఎమ్మెల్యే వెంకటరమ ణారెడ్డితోపాటు పార్టీ నాయకుడు ఈటల రాజేందర్ పలువురు సీనియర్లు విస్తృతంగా ప్రచారం నిర్వహించగా.. ఆ పార్టీ నేతలు, కార్యకర్తలు కూడా గెలుపు ధీమానే వ్యక్తం చేస్తున్నారు. ఏదేమైనా ఎమ్మెల్సీ ఉప ఎన్నిక పోలింగ్ నేడు జరగనుండగా.. ఎవ రికి పట్టభద్రులు పట్టం కడతారనే చర్చ సర్వత్రా సాగుతోంది.



వరంగల్ కలెక్టరేట్‌లో పోలింగ్ సామగ్రిని సరిచూసుకుంటున్న ఎన్నికల అధికారులు, సిబ్బంది

**వరంగల్-ఖమ్మం-నల్లగొండ ఎమ్మెల్సీ ఎన్నిక వివరాలు..**

- ఉమ్మడి వరంగల్ ఓటర్లు : **1,73,413**
- పోలింగ్ కేంద్రాలు : **227**
- బ్యాలెట్ బాక్సులు : **296**
- ఎన్నికల బరిలో ఉన్న అభ్యర్థులు : **52** మంది
- పోలింగ్ తేదీ : మే **27**
- సమయం : ఉదయం **8** గంటల నుంచి సాయంత్రం **4** గంటల వరకు
- ఓట్ల లెక్కింపు, ఫలితం : జూన్ **5**






**పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో గతంలో నమోదైన ఓట్ల వివరాలు..**

| సంవత్సరం | మొత్తం ఓట్లు | పోలైన ఓట్లు | చెల్లని ఓట్లు (శాతం) |
|---|---|---|---|
| 2015 | 2,81,138 | 1,53,548 | 19,995 (13 ) |
| 2021 | 5,05,565 | 3,87,969 | 21,636 (5.6) |

### పోలింగ్ కోసం పకడ్బందీ ఏర్పాట్లు.. ఆదివారం రాత్రే కేంద్రాలకు సిబ్బంది..

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నిక పోలింగ్ సందర్భం గా అధికారులు పకడ్బందీ ఏర్పాట్లు చేశారు. నియోజకవర్గ పరిధిలో మొత్తం 4,61,806 మంది ఓటర్లున్నారు. పూర్వ వరంగల్ జిల్లాలో 1,73,413 మంది ఓటర్లున్నట్లు అధికారులు ప్రక టించారు. ఇందుకోసం 227 పోలింగ్ కేంద్రాలు, 296 బ్యాలెట్ బాక్సులు ఏర్పాటు చేసినట్లు వెల్ల డించారు. ఈ ఎన్నికల నిర్వహణ కోసం 271 మంది ప్రిసైడింగ్, 217 మంది అసిస్టెంట్ ప్రిసై డింగ్, 314 మంది ఇతర ఎన్నికల అధికారులు కలిపి మొత్తం 628 మంది పనిచేస్తున్నట్లు తెలిపారు. కాగా, ఆదివారం మధ్యాహ్నం నుంచి ప్రిసైడింగ్, అసిస్టెంట్ ప్రిసైడింగ్, ఇతర పోలింగ్ అధికారులు డిస్ట్రిబ్యూషన్ కేంద్రాల నుంచి పోలింగ్ సామగ్రి తీసుకుని రాత్రి వరకే కేంద్రా లకు చేరుకున్నారు.

ఎన్నికల సామగ్రి పంపిణీ కేంద్రంలో మాట్లాడుతున్న జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ప్రావీణ్య



## సిబ్బంది బాధ్యతగా విధులు నిర్వర్తించాలి

- జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ పి.ప్రావీణ్య



**కాశోజీ సెంటర్ :** పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉపఎన్నిక పోలింగ్ సిబ్బంది విధు లను బాధ్యతాయుతంగా నిర్వర్తించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ పి.ప్రావీణ్య ఆదేశించారు. కలెక్టరేట్ ఆవరణలో ఆదివారం ఏర్పాటు చేసిన పోలింగ్ సామగ్రి పంపిణీ కేంద్రాన్ని అదనపు కలెక్టర్ సంధ్యా రాణి, డీఆర్‌ఓ శ్రీనివాస్‌తో కలిసి ఆమె పరిశీలించి మాట్లాడారు. 8 కౌంటర్లను ఏర్పాటు చేసి 11 రూట్లు, లొకేషన్ల ద్వారా 59 పోలింగ్ కేంద్రాలకు సామగ్రి తరలించినట్లు తెలిపారు. 71 మంది పీఓలు, 71 మంది ఏపీఓలు, 142 మంది ఓపీఓలు, 71 మంది మైక్రో అబ్జర్వర్లు, 11 మంది సెక్టోరల్ అధికారులు విధులు నిర్వర్తిస్తున్నట్లు పేర్కొన్నారు.

**వెబ్‌కాస్టింగ్, సీసీ కెమెరాలతో పర్యవేక్షణ**

ప్రతి పోలింగ్ కేంద్రంలో వెబ్‌కాస్టింగ్, సీసీ కెమెరాల ద్వారా ఓటింగ్ ప్రక్రియను పర్యవేక్షించనున్నట్లు ఆమె తెలిపారు. పోలింగ్ కేంద్రాల్లో వీల్ చైర్లు అందుబాటులో ఉంచామని, వృద్ధులు, దివ్యాంగులు, గర్భిణులు క్యూలో వేచి ఉండకుం డా తక్షణమే ఓటు హక్కు వినియోగించుకునే విధంగా అవ కాశం కల్పించాలని సూచించారు. పోలింగ్ ముగిసిన అనం తరం కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన రిసెప్షన్ కేంద్రంలో చెక్‌లిస్ట్ ప్రకారం సామగ్రి అందజేయాలని కలెక్టర్ కోరారు. ఫారం-16, పీఓ డైరీ పక్కాగా రాయాలని, ప్రతి రెండు గంటలకు పోలింగ్ శాతం నమోదుపై సెక్టోరల్ అధికారులు నివేదిక అందించాలని ఆదేశించారు. సోమవారం ఉదయం 8 గంటలకు పోలింగ్ ప్రక్రియ ప్రారంభించాలని, ఉదయం 7 గం టలకు ఏజెంట్లు సమక్షంలో బ్యాలెట్ బాక్స్ పరిశీలించాలని, అనంతరం సీల్ వేసి పోలింగ్ ప్రారంభించాలని చెప్పారు. పట్టభద్రులు తమ ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకోవాలని కలెక్టర్ కోరారు. కార్యక్రమంలో జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి బాలకృష్ణ, జెడ్పీ సీఈఓ రాంరెడ్డి, కలెక్టరేట్ ఏఓ శ్రీకాం త్, కలెక్టరేట్ తహసీల్దార్లు విశ్వనారాయణ, రమేశ్, మంజుల, తహసీల్దార్లు ఇక్బాల్, విజయ సాగర్, రియాజుద్దీన్ పాల్గొన్నారు.




పోలింగ్ సామగ్రితో ఆర్టీసీ బస్సు ఎక్కుతున్న సిబ్బంది

## నందిగామ కేంద్రంగా ఇన్సూరెన్స్ స్కాం

- ఈజీమనీకి అలవాటు పడి దందా
- మృత్యువుతో పోరాడుతున్న వారే టార్గెట్

**నర్సంపేట:** ఈజీ మనీకి అలవాటుపడిన వారు మృ త్యువుతో పోరాడుతున్న వారినే టార్గెట్‌గా ఎంచు కుంటున్నారు. వారి కుటుంబ సభ్యులకు మాయ మాటలు చెబుతూ డబ్బుల ఆశచూపిస్తున్నారు. చనిపోతే బీమా డబ్బులు వస్తాయని నమ్మిస్తు న్నారు. ఇలాంటి సంఘటనలు ఉమ్మడి వరంగల్ జిల్లాలోని నల్లబెల్లి మండలం నందిగామ కేంద్రం గా కొనసాగుతున్నాయి. విశ్వసనీయ సమాచారం ప్రకారం.. నందిగామ గ్రామానికి చెందిన ఓ వ్యక్తి బంధువు పాలకుర్తిలో తాగుడుకు బానిసై మృత్యు వుతో పోరాడుతున్నాడు. దీనిని సొమ్ము చేసు కోవాలని పాలకుర్తికి చేరుకుని ఆయన ఇన్సూరెన్స్ స్కాం గురించి వివరించాడు. అందుకు పాలకుర్తిలో కుటుంబ సభ్యులు అంగీకరించారు. మృత్యువుతో పోరాడుతున్న వ్యక్తికి సంబంధించిన మూడు ఎక రాల వ్యవసాయ భూమి పేపర్లు బ్యాంకులో పెట్టి సుమారు రూ.25 లక్షల విలువ చేసే కారు తీసుకు న్నారు. సదరు వ్యక్తిపై రూ.50 లక్షల ఇన్సూరెన్స్ చేయించారు. మృత్యువుతో పోరాడుతున్న వ్యక్తి చనిపోతే అతడి కుటుంబానికి ఇన్సూరెన్స్ డబ్బుల నుంచి రూ.25 లక్షలు, మిగిలిన రూ.25 లక్షలు అధికారుల ఖర్చుల కోసం, రుణంగా తీసుకున్న రూ.25 లక్షల విలువ చేసే కారు నందిగామ వ్యక్తికి చెందేలా ఒప్పందం చేసుకున్నారు. ఈ ఒప్పందం మేరకు మూడు కిస్తీలను నందిగామ వ్యక్తి చెల్లిం చాడు. పాలకుర్తిలో వ్యక్తి చనిపోకపోవడంతో కిస్తీ లు చెల్లించడం నిలిపివేశాడు. దీంతో ఇటీవల రుణం ఇచ్చిన బ్యాంకు అధికారులు పాలకుర్తి వాసికి వాయిదాలు చెల్లించాలని పలుమార్లు నోటీ సులు పంపించారు. కాగా, వారు స్థానికులను సం ప్రదించి నర్సంపేట పోలీసులను ఆశ్రయించి నం దిగామ వాసి నుంచి కారును స్వాధీనం చేసుకు న్నారు. చనిపోతే ఇన్సూరెన్స్ క్లెయిమ్ చేస్తూ డబ్బు లను పంచుకుంటున్నారు. వ్యక్తి బతికితే వాహ నాన్ని బ్యాంకు అధికారులకు అప్పగిస్తున్నారని ఈ ఘటనపై నర్సంపేట నియోజకవర్గంలో జోరుగా చర్చ జరుగుతోంది.

## అంగన్‌వాడీ కేంద్రాలకు కరెంట్ కష్టాలు

- ఉక్కపోతతో తల్లడిల్లుతున్న పిల్లలు, గర్భిణులు

**కాశోజీ సెంటర్ :** విద్యుత్ సౌకర్యం లేక అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులు, గర్భిణులు ఇబ్బందులు పడుతున్నారు. జిల్లాలోని వరంగల్, నర్సంపేట, వర్ధన్నపేట ప్రాజెక్టుల పరిధిలో మొత్తం 919 కేం ద్రాలు ఉన్నాయి. వీటిలో 185 కేంద్రాలకు సొంత భవనాలు, ఫ్రీ రెంట్ 335 కేంద్రాలు, రెంట్ 399 కేం ద్రాలు ఉన్నాయి. వీటి పరిధిలో గర్భిణులు 5,179, పాలిచ్చే తల్లులు 4,874, చిన్నారులు 40,277 మం ది ఉన్నారు. ఫ్రీ రెంట్, రెంట్ కేంద్రాలకు విద్యుత్ సౌకర్యం ఉంది. కానీ, ప్రభుత్వ సొంత భవనాలు ఉన్న కేంద్రాలకు విద్యుత్ లేదు. వేసవి కాలం కావ డంతో కేంద్రాలకు వచ్చే లబ్ధిదారులు ఉక్కపోతతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కలెక్టర్ స్పందిం చి అంగన్‌వాడీ కేంద్రాలకు విద్యుత్ వసతి కల్పిం చాలని పలువురు కోరుతున్నారు.



విద్యుత్ సౌకర్యం లేని నెక్కొండలోని అంగన్‌వాడీ కేంద్రం

**185 కేంద్రాలకు విద్యుత్ లేదు**



జిల్లాలో 185 అంగన్‌వాడీ కేం ద్రాలకు విద్యుత్ సౌకర్యం లేదు. ఇటీవల అధికారులు జిల్లాకు సంబంధించిన నివేదిక అడి గారు. అందుకు సంబంధించిన పూర్తి సమాచారం పంపుతున్నాం. ప్రభుత్వ నుంచి ఉత్తర్వులు రాగానే అంగన్‌వాడీ కేంద్రాలకు విద్యుత్ సౌకర్యం కల్పిస్తాం. **- జి.హైమావతి, డీడబ్ల్యూఓ**

## పాకాలలోకి దిగితే కష్టాలే...

**ఖానాపురం:** జిల్లాలో పర్యాటక ప్రాంతకమైన పాకాల అందాలను వీక్షించడానికి పర్యాటకులు భారీగా వస్తారు. కానీ, ఆదమరిచి పాకాల సరస్సు లోకి దిగితే కష్టాలు కొని తెచ్చుకున్నట్లేనని ఫారెస్ట్ సిబ్బంది చెబుతున్నారు. పాకాల సరస్సులో భారీ మొసళ్లు ఉన్నాయని, సరస్సులోకి ఎవరూ దిగొద్దని అధికారులు హెచ్చరిక బోర్డులు సైతం ఏర్పాటు చేశారు. కాగా, ఆదివారం ఒడ్డుపైకి పెద్ద మొసలి రావడంతో పలువురు ఆసక్తిగా తిలకించారు.



పాకాల సరస్సు వద్ద ఒడ్డుపైకి చేరుకున్న మొసలి

## రైల్లో ఏసీలు పనిచేయట్లేదని ఆందోళన

- 2.40 గంటలు నిలిచిన ఏపీ ఎక్స్‌ప్రెస్
- ఉక్కిరిబిక్కిరైన ప్రయాణికులు

**కాశిబుగ్గ:** న్యూఢిల్లీ నుంచి విశాఖపట్నం వెళ్లే ఏపీ ఎక్స్‌ప్రెస్ (20806) రైల్లో ఏసీలు పని చేయకపోవ డంతో ప్రయాణికులు ఆదివారం సాయంత్రం వరంగల్ రైల్వే స్టేషన్‌లో ఆందోళనకు దిగారు. సుమారు 1.40 గంటలు ఆలస్యంగా నడుస్తున్న ఏపీ ఎక్స్‌ప్రెస్ లోకో నుంచి పవర్‌కార్‌కు మధ్య సాంకేతిక సమస్య తలెత్తడంతో ఏసీలు పని చేయ లేదు. నాగ్‌పూర్ జంక్షన్ నుంచి ఏసీలు పనిచేయట్లే దని ప్రతీ స్టేషన్‌లో ప్రయాణికులు సంబంధిత అధికారులకు తెలిపినా ఎలాంటి చర్యలు చేప ట్టలేదు. దీంతో వరంగల్ రైల్వే స్టేషన్‌లో రైలు ఆగిన వెంటనే ప్రయాణికులు అధికారులకు తెలిపి పెద్ద ఎత్తున ఆందోళన దిగారు. ఏసీలు పనిచేయక పోవ డంతో గాలి రాక 13 కోచ్‌ల్లో ఉన్న పిల్లలు, వృద్ధులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నట్లు ఆవేదన వ్యక్తం చేశారు. లోకోలో సమస్య రావడంతో అధికారులు గుంటూరు నుంచి సికింద్రాబాద్‌కు వెళ్లే ఇంటర్‌సిటీ ఎక్స్‌ప్రెస్ రైలు లోకోను ఏపీ ఎక్స్‌ప్రెస్‌కు పెట్టిన తర్వాత 9.50 గంటల సమయంలో ఏపీ ఎక్స్‌ప్రెస్ బయల్దేరి వెళ్లిపోయింది. సుమారు 2.40 గంటల తర్వాత రైలు బయల్దేరి వెళ్లడంతో ప్రయాణికులు ఊపిరి పీల్చుకున్నారు.



ఆందోళన చేస్తున్న ఏపీ ఎక్స్‌ప్రెస్ ప్రయాణికులు

**చింతలపల్లిలో నిలిచిన ఇంటర్‌సిటీ..**

ఏపీ ఎక్స్‌ప్రెస్ రైలు లోకో సాంకేతిక సమస్యతో వరంగల్ రైల్వే స్టేషన్‌లో నిలిచి పోవడంతో చింతల పల్లిలో గుంటూరు నుంచి సికింద్రాబాద్ వస్తున్న ఇంటర్‌సిటీ ఎక్స్‌ప్రెస్ రైలును సుమారు 2.30 గం టల పాటు నిలిపారు. దాంతో అక్కడ రైలు ఎం దుకు ఆగిందో ప్రయాణికులు తెలియక ఇబ్బంది లు ఎదుర్కొన్నారు. ఏపీ ఎక్స్‌ప్రెస్ లోకోను ఇంటర్ సిటీకి, ఇంటర్‌సిటీ లోకోను ఏపీ ఎక్స్‌ప్రెస్‌కు మార్చిన తర్వాత రెండు రైళ్లు బయల్దేరి వెళ్లాయి.

### వేంకటేశ్వరస్వామిని దర్శించుకున్న సీపీ దంపతులు



సీపీ దంపతులకు ఆశీర్వచనాలు అందజేస్తున్న అర్చకులు

**చిల్పూరు:** వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్‌కి షోర్ ఝా దంపతులు ఆదివారం రాత్రి చిల్పూరు గుట్ట శ్రీ బుగులు వేంకటేశ్వరస్వామిని దర్శించుకు న్నారు. ఆలయ ప్రధాన అర్చకుడు రవీందర్‌శర్మ, అర్చకులు రంగాచార్యులు, కృష్ణమాచార్యులు ప్రత్యేక పూజల అనంతరం ఆలయ ఈఓ లక్ష్మీప్ర సన్న ఆధ్వర్యంలో సీపీ దంపతులకు ఆశీర్వచనాలు చేసి స్వామి వారి ప్రసాదాన్ని అందజేశారు. రఘు నాథపల్లి సీఐ శ్రీనివాస్, ఎస్సై ముత్యం రాజేందర్, సిబ్బంది ఉన్నారు.

## గ్రంథాలయ ఉద్యమానికి సహకరించాలి



గ్రంథాలయ ఉద్యమ యాత్రను ప్రారంభిస్తున్న కంది గోపాల్‌రెడ్డి

**నర్సంపేట:** లీడ్ లైబ్రరీ ఆధ్వర్యంలో తెలంగాణ వ్యాప్తంగా మరో గ్రంథాలయ ఉద్యమ యాత్ర కొన సాగిస్తున్నట్లు గ్రంథాలయ ఉద్యమకర్తలు కాసుల రవికుమార్, మంచికంటి తెలిపారు. నర్సంపేటలో గ్రంథాలయ ఉద్యమ యాత్రను ఆదివారం సిద్ధార్థ విద్యా సంస్థల అధినేత కంది గోపాల్‌రెడ్డి, ప్రముఖ వైద్యుడు జయుడు, కాంగ్రెస్ జిల్లా నాయకుడు తక్కళ్లపల్లి రవీందర్ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మరో గ్రం థాలయ ఉద్యమానికి పౌరులందరూ తమ సహ కారాన్ని అందించాలని కోరారు. ఈ గ్రంథాలయ ఉద్యమం రేపటి భవిష్యత్ తరాలకు ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. తెలంగాణలోని వరం గల్ జిల్లా నర్సంపేట కేంద్రంగా ఈ యాత్ర ప్రారం భించడం గర్వంగా ఉందని తెలిపారు. ప్రతి ఇంట్లో ఒక గ్రంథాలయం ఉండాలని, పిల్లలకు పుస్తకపఠ నాన్ని ఒక అలవాటుగా మార్చాలని కోరారు. లీడ్ గ్రామీణ గ్రంథాలయాల ద్వారా కాసుల రవికుమా ర్, శోభారాణి దంపతులు చేస్తున్న కృషిని కొనియా డారు. ఆంధ్రప్రదేశ్ నుంచి మంచికంటి ఈ కార్యక్ర మంలో పాల్గొనడం సంతోషంగా ఉందన్నారు. జీజుల సాగర్, ఉపాధ్యాయులు రఘుపతి, లీడ్ గ్రం థాలయ నిర్వాహకురాలు శోభారాణి, సాంబయ్య, శివ తదితరులు పాల్గొన్నారు.

## రెజ్లర్ల సంక్షేమానికి కృషి

**వరంగల్ స్పోర్ట్స్:** తెలంగాణలో రెజ్లింగ్ క్రీడాభివృ ద్ధితో పాటు రెజ్లర్ల సంక్షేమానికి తాము నిరంతరం కృషి చేస్తున్నామని తెలంగాణ రెజ్లింగ్ అసోసియే షన్ రాష్ట్ర అధ్యక్షుడు హఫీజ్‌ఖాన్ అన్నారు. తెలం గాణ అమెచ్యూర్ రెజ్లింగ్ అసోసియేషన్ సర్వసభ్య సమావేశం ఆదివారం హనుమకొండలోని ఓ ప్రై వేట్ కళాశాలలో జరిగింది. ఈసమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన హఫీజ్‌ఖాన్ మాట్లాడుతూ.. రెజ్లింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియాపై కేంద్ర ప్రభు త్వం ఇప్పటికీ నిషేధం తొలగించలేదన్నారు. మరో వారంలో ఫెడరేషన్‌కు సంబంధించి కోర్టు తుది తీర్పు వస్తుందని, అసోసియేషన్ నూతన క్యాలెండ ర్‌ను రూపొందిస్తున్నట్లు తెలిపారు. త్వరలో రాష్ట్ర సంఘంతో కూడిన బృందం ఫెడరేషన్‌తో పాటు సాయ్, ఇండియన్ ఒలింపిక్స్ బాధ్యులను కలిసేం దుకు ఢిల్లీకి వెళ్లనున్నట్లు తెలిపారు. సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎండీ కరీం మాట్లాడుతూ.. 2023-24 కు సంబంధించిన క్రీడా నివేదికను వెల్ల డించారు. రాష్ట్ర వ్యాప్తంగా ఆయా జిల్లాల బాధ్యు లు క్రీడాకారుల నైపుణ్యం పెంపొందించేందుకు ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

## క్లుప్తంగా

### విధులకు ఆటంకం కలిగించిన వ్యక్తిపై కేసు

గార్ల: పోలీసులను దుర్భాషలాడి, వారి విధులకు ఆటంకం కలిగించిన వ్యక్తిపై కేసు నమోదైంది. ఎస్సై జీనత్‌కుమార్ కథనం ప్రకారం.. గార్ల మండలం అంజనాపురం గ్రామానికి చెందిన గుగులోత్ మధు.. మద్యం సేవించి తండ్రి ధర్మపై గొడవ పడ్డాడు. కుమారుడి వేధింపులు తాళలేక తండ్రి 100కు డయల్ చేశాడు. దీంతో పోలీసు సిబ్బంది సిరాజ్ పాషా, శ్రీను, ప్రసాద్.. అంజనాపురం వెళ్లారు. తండ్రితోని ఎందుకు గొడవ పడుతున్నావని మధును మందలించారు. దీంతో మద్యం మత్తులో ఉన్న మధు.. పోలీసులపై తిరగబడడమే కాకుండా దుర్భాషలాడారు. పోలీస్ వాహనాన్ని గంటపాటు అడ్డుకున్నాడు. ఈ ఘటనపై కానిస్టేబుల్ సిరాజ్‌పాషా ఫిర్యాదు మేరకు మధుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ఆదివారం వెల్లడించారు.

### సింగరేణి కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

- మావోయిస్టు సింగరేణి కోల్‌బెల్ట్ కమిటీ కార్యదర్శి లేఖ

భూపాలపల్లి అర్బన్ : సింగరేణి కార్మికుల సమస్యల పరిష్కారంపై సీఎం రేవంత్‌రెడ్డి ప్రత్యేక దృష్టి సారించాలని కోరుతూ మావోయిస్టు సింగరేణి కోల్‌బెల్ట్ కమిటీ కార్యదర్శి ప్రభాత్ ఆదివారం లేఖ విడుదల చేశారు. సింగరేణి ప్రైవేటీకరించకుండా చర్యలు తీసుకోవాలని, విద్యుత్ సంస్థల నుంచి సింగరేణికి రావాల్సిన బకాయిలు విడుదల చేయాలని, ఓపెన్ కాస్టులను రద్దు చేసి భూగర్భ గనుల ద్వారానే బొగ్గు ఉత్పత్తి చేయాలని కోరారు. కాంట్రాక్ట్ వ్యవస్థను రద్దు చేసి ఉద్యోగావకాశాలు కల్పించాలని, కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ కార్మికుల సమస్యలు పరిష్కరించి డిస్మిస్ కార్మికులను విధుల్లోకి తీసుకోవాలన్నారు. కార్మికులకు ఆదాయ పన్ను రద్దు చేసి వారి పిల్లల కోసం సింగరేణి పాఠశాలలు అభివృద్ధి చేసి ప్రత్యేక యూనివర్సిటీలు ఏర్పాటు చేయాలన్నారు. గత ప్రభుత్వాల మాదిరిగానే కాంగ్రెస్ వ్యవహరిస్తే తగిన మూల్యం చెల్లించక తప్పదన్నారు.

### చిందేసిన ఎస్పీ



పోలీస్ అధికారులతో కలిసి నృత్యం చేస్తున్న ఎస్పీ

భూపాలపల్లి అర్బన్: లోక్‌సభ ఎన్నికలు ప్రశాంతంగా ముగియడంతో శనివారం రాత్రి ఎస్పీ కిరణ్‌ఖరే ఆధ్వర్యంలో పోలీస్ అధికారులు, సిబ్బంది ఆత్మీయ విందు కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ విందులో పోలీస్ అధికారులు, సిబ్బందితో కలిసి సినిమా పాటలకు ఎస్పీ నృత్యం చేశారు.






# ప్రేమ విఫలమై.. మనసు ముక్కలై..



**యువతలో పెరుగుతున్న బలవన్మరణాలు**

- క్షణికావేశంలో అఘాయిత్యాలు
- తల్లడిల్లుతున్న తల్లిదండ్రులు
- 17 నుంచి 22 ఏళ్ల వారే అధికం

క్షణికావేశంలో కొందరు.. ఆలోచన లేక మరికొందరు.. సరైన సూచనలు అందక ఇంకొందరు..ఇలా ఇరువై ఏళ్లు నిండని యువకులు బలవన్మరణాలకు పాల్పడుతున్నారు. సినిమా ప్రభావానికి లోనై సహ విద్యార్థులతో ప్రేమలో పడుతున్నారు. ఈ ప్రేమను నెగ్గించుకునే దారి తెలియక, ఆలోచనలు అదుపులో పెట్టుకోలేక ఆత్మహత్యల వైపునకు వెళ్తున్నారు. ఫలితంగా తల్లిదండ్రులకు తీరని శోకం కలుగుతోంది. ఉమ్మడి వరంగల్ జిల్లాలో వరుసగా చోటు చేసుకుంటున్న ఘటనలే దీనికి నిదర్శనం.

-కాజీపేట

**కొత్త కారణం..**

అప్పుల బాధ తట్టుకోలేక.. ఇంటి బాధ్యతలు మోయలేక, ఆర్థిక సమస్యలు పరిష్కరించలేక ఇన్నాళ్లూ ఆత్మహత్యలు చేసుకోవడం చూశాం. కానీ ప్రస్తుతం చావుకు కొత్త కారణం వెలుగుచూస్తోంది. అదే ప్రేమ. కనిపెంచిన తల్లిదండ్రులు, కనిపెట్టుకుని ఉండే స్నేహితులను కూడా కాదని ప్రేమ కోసం విలువైన జీవితం బలి పెడుతున్నారు. వయసుతో పాటు వచ్చే ఆకర్షణను అర్థం చేసుకోలేక.. మితిమీరిన ఆలోచనలతో జీవితాలు పాడు చేసుకుంటున్నారు. ముఖ్యంగా నేటి యువతపై సినిమా తీవ్ర ప్రభావం చూపుతోంది. హీరో, హీరోయిన్లను అనుకరించడంతో పాటు ఆ పాత్రలను అనుసరించడంతో సమస్యలు వస్తున్నాయి.

**జీవితం విలువ తెలుసుకోలేక..**

కౌమార దశలో ఉన్న యువత ప్రేమ, ఆకర్షణకు తేడా తెలుసుకోలేకపోతున్నారు. వయసుతో పాటు సహజంగా వచ్చే మార్పులకు మితిమీరిన ఆలోచనలు తోడు కావడంతో వీరు పెడదారిన పడుతున్నారు. దీనికి తోడు ఇంటి వద్ద, విద్యాలయాల్లో ఒత్తిడి కూడా వీరిని చిత్తు చేస్తోంది. యుక్త వయసులోకి అడుగుపెట్టడంతో పాటు జల్సాల వైపు దృష్టి పెట్టడం.. ఖాళీ సమయాల్లో సినిమాలకు వెళ్లడం.. తల్లిదండ్రుల సావాసం దూరమవుతుండడంతో ఘోరాలు జరుగుతున్నాయి.

**మోసకారి మొబైళ్లు..**

ప్రస్తుతం ప్రతి ఒక్కరికీ అందుబాటులోకి వచ్చిన ఆండ్రాయిడ్ మొబైల్ కూడా యువతను పక్కదోవ పట్టిస్తోంది. పదో తరగతిలోనే చేతికి సెల్‌ఫోన్ రావడంతో పుస్తకాలు చదివే అలవాటు, తద్వారా మానసిక పరిణితి పొందే అవకాశాలను యువత పూర్తిగా దూరం చేసుకుంటోంది. ఇష్టానుసారంగా వస్తున్న సోషల్ మీడియా పోస్టింగ్‌లతో పాటు అభూత కల్పనలు, చిన్నకవితలు, మెసేజ్‌లు తెలియని స్నేహితులను కూడా దగ్గరకు చేర్చుతున్నాయి. స్నేహితుల మధ్య బంధాన్ని ప్రేమగా మార్చి యువతను మోసగిస్తున్నాయి.

**ప్రేమికుల ఆత్మహత్యలు..**

ఉమ్మడి వరంగల్ జిల్లాలో గతంలో కంటే ఈ ఏడాది ప్రేమికుల ఆత్మహత్యలు పెరిగాయి. మచ్చుకు కొన్ని ఘటనలు. ఈ ఏడాది మార్చి 22న ఉప్పల్ వద్ద ప్రేమికులు రైలు కిందపడి ఆత్మహత్యకు పాల్పడ్డారు. తల్లిదండ్రులకు తీవ్ర దుఃఖం మిగిల్చారు. ఈ నెల 24న కాజీపేట రైల్వే స్టేషన్ సమీపంలో వరంగల్ కాశిబుగ్గకు చెందిన మేకమల్ల చెన్నకేశవ్ (19), ఖమ్మం జిల్లా కేంద్రంలోని సారథి నగర్ కాలనీ చెందిన బాలిక (17) నవజీవన్ ఎక్స్‌ప్రెస్ కిందపడి ఆత్మహత్యకు యత్నించారు. ఈ ఘటనలో బాలిక మృతి చెందగా యువకుడు ప్రాణాపాయ స్థితిలో కొట్టుమిట్టాడుతున్నాడు. అదే రోజు మహబూబాబాద్ జిల్లా గూడూరుకు చెందిన యువకుడు బాదావత్ నవీన్.. ప్రేమ విఫలమయ్యిందనే ఆవేదనలో క్షణికావేశానికి లోనై పురుగుల మందు తాగి బలవన్మరణానికి పాల్పడ్డారు. ఇలాంటి ఘటనలు రోజు ఎక్కడో ఒకచోట వెలుగు చూస్తునే ఉంటున్నాయి.

**అవగాహన కార్యక్రమాలేవీ?**

ర్యాగింగ్ నిర్మూలనలో భాగంగా గతంలో ప్రభుత్వ కళాశాలల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించేవారు. ఆత్మహత్యలు, ఒత్తిడిని జయించడం వంటి అంశాలపై అవగాహన కల్పించే వారు. ఈ పాఠాలు ప్రస్తుతం కనుమరుగయ్యాయి. అవగాహన కార్యక్రమాలు పూర్తి స్థాయిలో జరుగుతున్న దాఖలాలు కనిపించడం లేదు. తల్లిదండ్రులతో మాట్లాడుతున్న సమయం తగ్గుతూ వస్తోంది. ఫలితంగా యువతకు మార్గదర్శనం కనుమరుగైంది.

**ఆ ప్రేమ కనిపించకేనా..?**

ఈమె మీ అమ్మమ్మ.. ఈయన మీ తాతయ్య.. ఇది మన ఊరు.. ఇతడు మనవాడు బాగా చదువుకుని ఉన్నత స్థానంలో ఉన్నాడని ప్రేమగా కబుర్లు చెప్పే తల్లిదండ్రులు ప్రస్తుతం తక్కువైపోతున్నారు. మార్కులు, ర్యాంకులు, కెరీర్, సంపాదన ఒత్తిడిలో పడి పిల్లలతో మాట్లాడే సమయం తగ్గిస్తున్నారు. అదే పిల్లలను వేరే ప్రేమ వెతుక్కునేలా చేస్తోంది.



**తల్లిదండ్రుల లోపం కూడా..**



యుక్త వయసులోకి వస్తున్న తమ పిల్లలపై తల్లిదండ్రులు దృష్టి సారించాలి. వారిని పెడదోవ పట్టకుండా చూడాలి. తమ కుటుంబ జీవనం, భవిష్యత్‌లో సాధించాల్సిన లక్ష్యాలను వివరించాలి. ప్రస్తుతం చాలా మంది ఇంటి వద్ద ప్రేమ పొందలేకపోతున్నారు. ఫలితంగా ఆరు బయట ఆకర్షణకు గురవుతున్నారు. టీనేజీలోని ఈ ఆకర్షణను ప్రేమగా భావించుకుని అనర్థాల వైపునకు మళ్లుతున్నారు.

-బర్ల వెంకటేశ్వర్లు, రిటైర్డ్ ఎస్సై, కాజీపేట

**వ్యక్తిత్వ వికాస తరగతులేవీ?**



ప్రతి కళాశాలలో వ్యక్తిత్వ వికాస తరగతులు ఉండాలి. ఉన్నత పాఠశాలల్లో వ్యక్తిత్వ వికాసానికి సంబంధించిన పాఠ్యాంశాలు ఉండాలి. అయితే ఇవి ప్రస్తుతం పాఠ్యాంశాల కరిక్యులమ్‌లో లేవు. దీంతో నేటి యువత చాలా ఇబ్బందులు పడుతోంది. కళాశాలల్లో కూడా ప్రముఖులతో యువతకు వ్యక్తిత్వ వికాసం పెంపొందించే ఏర్పాటు చేయాలి.

-బరుపాటి గోపి, వ్యక్తిత్వ వికాస నిపుణుడు

## ప్రేమ పేరుతో మోసం.. యువకుడి ఆత్మహత్య

- సోమిడిలో విషాదఛాయలు



రాజ్‌కుమార్ (ఫైల్)

కాజీపేట : ప్రేమ పేరుతో యువతి మోసం చేసిందనే మనస్తాపంతో ఓ యువకుడు రైలు కిందపడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన నల్లగొండ సమీపంలో చోటు చేసుకుంది. మృతుడి కుటుంబీకుల కథనం ప్రకారం.. కాజీపేట మండలం సోమిడికి చెందిన మంతుర్తి రమేశ్, రాజమ్మ దంపతుల కుమారుడు రాజ్‌కుమార్ (28) దాదాపు ఏడేళ్లుగా హైదరాబాద్‌లో ప్రైవేట్ కంపెనీలో ఉద్యోగం చేస్తున్నాడు. పనిచేసే చోట పరిచమైన ఓ యువతితో కొద్దికాలంగా చనువుగా ఉంటున్నాడు. సూర్యాపేట జిల్లాకు చెందిన సదరు యువతి కుటుంబీకులకు ఇటీవల వీరి ప్రేమ విషయం తెలియడంతో రాజ్‌కుమార్‌ను హెచ్చరించారు. దీంతో రాజ్‌కుమార్ ఎదురు తిరగడంతో యువతి బంధువులు సూర్యాపేట పీఎస్‌లో ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో ప్రేమించిన యువతి.. కుటుంబీకుల ఒత్తిడికి తలొగ్గి ఎదురు తిరగడం, బంధువులు చంపేస్తామంటూ బెదిరించడంతో రాజ్‌కుమార్ మనస్తాపానికి గురయ్యాడు. దీంతో ఏడేళ్లుగా సాగిన ప్రేమాయణం .. ప్రస్తుతం జరుగుతున్న పరిణామాలను వివరిస్తూ సెల్ఫీ వీడియోను రికార్డు చేసి ఆత్మహత్య చేసుకుంటున్నట్లు బంధు, మిత్రులకు పంపించాడు. వెంటనే అప్రమత్తమైన సన్నిహితులు రాజ్‌కుమార్‌ను వెతకడానికి ప్రయత్నించగా సూర్యాపేటలో చిక్కాడు. ఎంత నచ్చ చెప్పినా వినకుండా తనకు ఆత్మహత్యే శరణ్యమని చెప్పి పరారయ్యాడు. ఈ క్రమంలో శనివారం ఉదయం నల్లగొండ సమీపంలో గుర్తుతెలియని రైలు కిందపడి ఆత్మహత్యకు పాల్పడిన విషయం వెలుగు చూసింది. యువతి కుటుంబీకుల బెదిరింపుల వల్లే తమ కుమారుడు ఆత్మహత్యకు పాల్పడినట్లు మృతుడి తల్లిదండ్రులు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపడుతున్నారు. కాగా, చెట్టంత ఎదిగిన కుమారుడు ప్రేమ కోసం బలయ్యాడని, తనను బెదిరించిన వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకోవాలని కుటుంబీకులు కోరారు.

## కురవి సొసైటీ చైర్మన్‌పై దాడి

కురవి: కురవి సొసైటీ చైర్మన్ దొడ్డ గోవర్ధన్‌రెడ్డిపై కొందరు వ్యక్తులు దాడికి పాల్పడ్డాడు. ఈ ఘటన ఆదివారం మండలంలోని నేరడలో జరిగింది. నేరడ గ్రామంలో గౌడ కులస్తుల ఆరాధ్యదైవం కాటమయ్య పండుగ జరిగింది. ఈ పండుగకు ఓ వ్యక్తి.. కురవి సొసైటీ చైర్మన్ దొడ్డ గోవర్ధన్‌రెడ్డితోపాటు అదే గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకులను పిలిచాడు. అక్కడ చైర్మన్, వేరే వ్యక్తులకు స్వల్పంగా మాటమాట పెరిగింది. భోజనాల అనంతరం చైర్మన్ తన పామాయిల్ తోట వద్దకు వెళ్లాడు. ఈ క్రమంలో ఇరుగు వెంకన్న, వంశీ, గోపితోపాటు మరికొందరు వ్యక్తులు చైర్మన్ గోవర్ధన్‌రెడ్డి తోట వద్దకు వెళ్లి గొడవకు దిగి అతడిపై దాడికి పాల్పడ్డారు. ఈ ఘటనపై చైర్మన్ గోవర్ధన్‌రెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. అలాగే, చైర్మన్‌పై వెంకన్న తదితరులు ఫిర్యాదు చేశారు. ఇరువర్గాలు ఫిర్యాదులు చేసుకున్నాయి. ఈ విషయంపై ఎస్సై గోపిని వివరణ కోరగా నేరడకు చెందిన ఘర్షణపై రెండువర్గాలకు చెందిన వ్యక్తులు ఫిర్యాదులు చేశారని, విచారణ చేసి కేసులు నమోదు చేస్తామన్నారు.

# ఘరానా మోసం..

- బ్యాంకులో బంగారం స్థానంలో నకిలీ ప్రత్యక్షం
- పరారీలో గోల్డ్ అప్రైజర్
- పోలీసులకు బ్యాంక్ అధికారుల ఫిర్యాదు



తాళం వేసి ఉన్న గోల్డ్ షాపు

మంగపేట : మండలంలోని రాజుపేట కెనరా బ్యాంకులో ఘరానా మోసం జరిగింది. బ్యాంకు గోల్డ్ అప్రైజర్.. వినియోగదారులు కుదువపెట్టిన బంగారం స్థానంలో నకిలీ గోల్డ్ ఉంచాడు. అనంతరం వియోగదారుల బంగారంతో పరారయ్యాడు. ఈ విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. బ్యాంకులో మూడు నెలలకు ఒకసారి నిర్వహించే తనిఖీల్లో ఈ విషయం బయటపడింది. దీంతో వరంగల్ రీజినల్ కార్యాలయ అధికారులు ఈ విషయంపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు సమాచారం. బ్యాంకు గోల్డ్ అప్రైజర్ అందుబాటులో లేకపోవడం.. అతడి ఫోన్ స్విచ్ఛాఫ్ రావడంతో అధికారులు అతడిపై అనుమానంతో పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలుస్తోంది. బ్యాంకులో మాయమైన బంగారు విలువ రూ. 2 కోట్ల వరకు ఉంటుందని సమాచారం. వరంగల్ జిల్లా నర్సంపేట మండలానికి చెందిన సమ్మెట ప్రశాంత్ రెండు సంవత్సరాల నుంచి బ్యాంకు అప్రైజర్‌గా పనిచేస్తున్నాడు. బ్యాంకు పరిధిలోని రైతులు, వ్యాపారులతో పరిచయాలు పెంచుకున్నారు. బ్యాంకు పక్కన ఓ ఇంటిని అద్దెకు తీసుకుని 'సాయిరాం జ్యువెలర్స్' షాపు నిర్వహిస్తున్నాడు. ఈ క్రమంలో కొందరు స్థానికుల నుంచి రూ . 50 లక్షలకు పైగా అప్పు తీసుకున్నట్లు తెలుస్తోంది. కొద్ది రోజుల నుంచి ప్రశాంత్ ఇంటికి తాళం వేసి ఉండడం, బ్యాంకు అధికారులు అతడిపై పోలీసులకు ఫిర్యాదు చేయడంతో అప్పు ఇచ్చిన బాధితులు ఒక్కొక్కరుగా బయటకు వస్తున్నారు.

**ఖాతాదారుల్లో ఆందోళన..**

బ్యాంకులో బంగారం మాయం చేసినట్లు ప్రచారం జరుగుతుండడంతో ఖాతాదారుల్లో ఆందోళన మొదలైంది. గోల్డ్ అప్రైజర్ ప్రశాంత్‌కు బంగారం షాపు ఉండడంతో రైతులు, వ్యాపారులు, స్థానికులు అతడి వద్ద బంగారం కొనుగోలు చేసి ఆర్థిక అవసరాల కోసం బ్యాంకులో తాకట్టుపెట్టారు. ఈ క్రమంలో బ్యాంకులో నకిలీ బంగారం ఉదాంతం వెలుగు చూడడంతో ప్రశాంత్‌పై అనుమానం వ్యక్తం చేస్తున్నారు. తమకు ఇచ్చిన బంగారం అసలైందా లేక నకిలీదా అనే అనుమానం సైతం వ్యక్తం చేస్తున్నారు. అతడి వద్ద బంగారం కొనుగోలు చేసిన కొందరు వ్యక్తులు.. అదే బంగారం బ్యాంకులో కుదువపెట్టి వచ్చిన డబ్బును అతడికే అప్పుగా ఇచ్చినట్లు తెలుస్తోంది.

**పథకం ప్రకారమే జరిగిందా?**

బ్యాంకులో నకిలీ బంగారం విషయం పథకం ప్రకారమే జరిగి ఉంటుందనే చర్చ జరుగుతోంది. బ్యాంకు లావాదేవీల విషయంలో బ్రోకర్లను ఆశ్రయించొద్దని బ్యాంకు ఎదుట బోర్డు ఏర్పాటు చేసిన మేనేజర్ .. ఈ విషయంలో ఎందుకు దృష్టి సారించలేకపోయారని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. ప్రశాంత్ వ్యవహార శైలిని పసిగట్ట లేకపోయారా? లేక ఇంకేమైనా జరిగిందా అనే సందేహం కలుగుతోందని స్థానికులు పేర్కొంటున్నారు.

**విషయం ఇలా వెలుగు చూసింది**

ప్రశాంత్ వరంగల్‌కు చెందిన ఓ బంగారం షాపు యజమానికి అప్పు చెల్లించాల్సి ఉంది. తాను కొద్ది రోజుల నుంచి డబ్బు కోసం ఫోన్ చేస్తే ప్రశాంత్ లిఫ్ట్ చేయకపోవడంతో సదరు వ్యాపారి నేరుగా రాజుపేటకు వచ్చాడు. పథకం ప్రకారం అప్పటికే రెండు రోజుల క్రితమే విధులకు సెలవు పెట్టిన ప్రశాంత్ తాను అద్దెకుంటున్న ఇల్లు, షాపునకు తాళం వేసి బంగారం, ఖరీదైన వస్తువులతో కారులో ఉడాయించాడు. దీంతో వ్యాపారి బ్యాంకుకు వెళ్లి ఆరా తీశాడు. సెలవు అయిపోయి రెండు రోజులు గడుస్తున్నా విధులకు హాజరు కాకపోవడం.. ఇంటికి తాళం వేసి ఉండడంతో పాటు ఫోన్ స్విచ్ఛాఫ్ రావడంతో అనుమానం వచ్చి బ్యాంకులో తాకట్టు పెట్టిన బంగారం పరిశీలించగా నకిలీ అనే విషయం బయపడిందని స్థానికులు చర్చించుకుంటున్నారు.

## తల్లిని పోషించే విషయంలో ఘర్షణ

- అన్నపై తమ్ముడి దాడి
- వేమునూరులో ఘటన



చికిత్స పొందుతున్న వెంకన్న

మహబూబాబాద్ రూరల్ : తల్లిని పోషించే విషయంలో అన్నదమ్ముల మధ్య ఘర్షణ జరిగింది. ఇందులో అన్నపై తమ్ముడు దాడికి పాల్పడ్డాడు. ఈ ఘటన ఆదివారం మహబూబాబాద్ మండలం వేమునూరులో చోటుచేసుకుంది. బాధితుడు డొంకెని వెంకన్న కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన డొంకెని పిచ్చమ్మకు ఇద్దరు కుమారులు వెంకన్న, రమేశ్ ఉన్నారు. కొంతకాలం నుంచి పిచ్చమ్మ తన చిన్న కుమారుడు రమేశ్ ఇంటివద్ద ఉంటుంది. ఈ క్రమంలో తనకు అన్నం పెట్టడంలేదని తల్లి.. రమేశ్ ఇంటి ఎదుట కూర్చుంది. ఈ విషయం తెలుసుకున్న పెద్ద కుమారుడు వెంకన్న తల్లి వద్దకు వెళ్లి అన్నం ఎందుకు పెట్టడలేదని అడుగుదాం రమ్మని తమ్ముడి వద్దకు వెళ్లాడు. ఈ క్రమంలో అన్నదమ్ముల మధ్య మాటామాటా పెరిగి ఘర్షణకు దారితీసింది. ఇందులో వెంకన్నపై తమ్ముడు రమేశ్, తన కుటుంబీకులు దాడికి పాల్పడ్డాడు. ఈ దాడిలో వెంకన్నకు తీవ్రగాయాలుకాగా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై బాధితుడి ఫిర్యాదు మేరకు రూరల్ బ్లూకోల్ట్స్ పీసీలు సోమమల్లు, హుస్సేన్ ఘటనాస్థలికి చేరుకుని విచారణ చేపట్టారు.

# దొంగల ముఠా అరెస్ట్..

- రూ.10.90 లక్షల విలువైన సొత్తు స్వాధీనం
- వివరాలు వెల్లడించిన సీఐ సురేశ్



మాట్లాడుతున్న సీఐ సురేశ్

హసన్‌పర్తి : పగలు రెక్కీ..అర్ధరాత్రి చోరీలకు పాల్పడుతున్న ఓ దొంగల ముఠాను పోలీసులు అరెస్ట్ చేశారు. ఎర్రగట్టుగుట్ట ప్రాంతంలో వాహనాల తనిఖీ సందర్భంగా ఓ ఆటో.. పోలీసులను చూసి ఆపకుండా ముందుకు సాగింది. దీంతో వెంబడించి ఆటోను పట్టుకుని విచారించగా ఆ ముఠా తమ నేరం ఒప్పుకుంది. ఆదివారం హసన్‌పర్తి పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీఐ సురేశ్ వివరాలు వెల్లడించారు. పాలకుర్తికి చెందిన సాలోంకి రాజారాం, హైదరాబాద్‌లోని చంద్రాయణగుట్ట బాబానగర్‌కు చెందిన సాలోంకి రాజు స్నేహితులు. కూలీ పని చేసుకుంటూ జీవిస్తున్నారు. ఈ క్రమంలో జల్సాలకు అలవాటు పడిన వీరు కూలీ డబ్బులు సరిపడకపోవడంతో చోరీలు చేయడం ప్రారంభించారు. ఇందులో భాగంగా తాళం వేసి ఉన్న ఇళ్లే టార్గెట్‌గా అర్ధరాత్రి చోరీలకు పాల్పడుతున్నారు. ఈ క్రమంలో హసన్‌పర్తి, ఎల్కతుర్తి మండలాల్లోని పలు ప్రాంతాల్లో చోరీకి పాల్పడ్డారు. నిందితుల నుంచి రూ.5.60 లక్షల విలువైన బంగారం, రూ. 20 వేల విలువైన వెండి, రూ.30 వేల విలువైన ఎల్‌ఈడీ టీవీ, రూ.4.80 లక్షల విలువైన 32 స్మార్ట్ ఫోన్లు మొత్తం రూ.10. 90 లక్షల విలువైన సొత్తు స్వాధీనం చేసుకున్నట్లు సీఐ చెప్పారు. కాగా, గ్రామాల్లో ప్రతి ఒక్కరూ సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సీఐ సూచించారు. ఇతర ప్రాంతాలకు వెళ్లినప్పుడు పోలీసులకు సమాచారం ఇవ్వాలని చెప్పారు.

# యథేచ్ఛగా రియల్ దందా..

**నిబంధనలకు విరుద్ధంగా వెంచర్లు**

- నివేశిత స్థలాలుగా వ్యవసాయ భూములు
- ప్రభుత్వ ఖజానాకు భారీ గండి
- పట్టించుకోని అధికారులు



నాన్ లేఔట్ వెంచర్

హసన్‌పర్తి : భూముల ధరలు పెరగడంతో రియల్ వ్యాపారులు అక్రమాలకు పాల్పడుతూ అమాయకులను నట్టేట ముంచుతున్నారు. అధికారులను మచ్చిక చేసుకుని నిబంధనలకు విరుద్ధంగా వెంచర్లు చేస్తున్నారు. ఆ వెంచర్లల్లో ఎలాంటి సౌకర్యాలు కల్పించకుండా లక్షలాది రూపాయల లాభాలు పొందుతున్నారు. ఎక్కువ శాతం గ్రామాల్లోనే ఈ వ్యాపారం సాగుతోంది.

**నివేశిత స్థలాలుగా వ్యవసాయ భూములు..**

హసన్‌పర్తి మండలంలోని పలు గ్రామాల్లో వ్యవసాయ భూములు నివేశిత స్థలాలుగా మారుతున్నాయి. కార్పొరేషన్‌లో విలీనమైన గ్రామాలతో పాటు గ్రామీణ ప్రాంతాల్లో ఈ వ్యాపారం జోరుగా సాగుతోంది. ముఖ్యంగా మండలంలోని మడిపల్లి, జయగిరి, గంటూరుపల్లి, పెంబర్తి, నాగారం, భైరాన్‌పల్లి, సిద్ధాపురంతో పాటు విలీన గ్రామాలు హసన్‌పర్తి, దేవన్నపేట, చింతగట్టు, మునిపల్లి, భీమారం, పెగడపల్లి, పలివేల్పుల, వంగపహాడ్, ఆరెపల్లి, పైడిపల్లి, కొత్తపేట, ఉనికిచర్ల, ముచ్చర్ల, కోమటిపల్లి, ఎల్లాపురం గ్రామాల్లో రియల్ ఎస్టేట్ వ్యాపారం యథేచ్ఛగా సాగుతోంది. నిబంధనలకు విరుద్ధంగా ఎక్కడపడితే అక్కడే వెంచర్లు వెలుస్తున్నాయి.

**అధికారులకు కూడా వాటాలు?**

హసన్‌పర్తి మండలంలో నిబంధనలకు విరుద్ధంగా వెంచర్లు వెలుస్తున్నాయి. ఈ వ్యవహారంలో అధికారులకు కూడా వాటాలు ముట్టుతున్నట్లు ప్రచారం జరుగుతోంది. కొన్ని గ్రామాల్లో అధికారులు వెంచర్లలో భాగస్వాములుగా ఉన్నట్లు స్థానికంగా చర్చ సాగుతోంది.

**అందినకాడికి దండుకుంటున్న వ్యాపారులు**

అక్రమ లేఔట్లతో ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండి పడుతోంది. నిబంధనల మేరకు వెంచర్లు చేయాలంటే అనుమతి తప్పని. అయితే ఇందులో మార్కెట్ ధరకనుగుణంగా గజానికి కొంత మేరకు ప్రభుత్వ ఖజానాలో డబ్బు జమా చేయాల్సి ఉంటోంది. దీంతో పాటు 20శాతం మేరకు భూమిని 'కుడా'కు తనఖా పెట్టాలనే నిబంధన ఉంది. దీంతో నిబంధనల ప్రకారం వెంచర్ చేపడితే ఈతతంగం ఉంటుందని భావిస్తున్న రియల్ వ్యాపారులు అడ్డదారులు తొక్కుతున్నారు. అక్రమంగా వెంచర్లు వేస్తూ అందినకాడికి దండుకుంటున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. కాగా, ఈ విషయంలో మండల పంచాయతీ అధికారి రవిబాబును అడగగా, రియల్ వ్యాపారులు అక్రమంగా హద్దులు పాతుతే వాటిని తొలగించే బాధ్యత 'కుడా'అధికారులదేనన్నారు.

## బాలిక కిడ్నాప్ కేసులో ఇద్దరి అరెస్ట్



వివరాలు వెల్లడిస్తున్న సీఐ రవిరాజ్

పరకాల: పెళ్లి పేరుతో బాలికను కిడ్నాప్ చేసి కేసులో పోలీసులు ఇద్దరిని అరెస్ట్ చేశారు. ఆదివారం పరకాల పోలీసుస్టేషన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో సీఐ డి.రవిరాజ్.. కేసు వివరాలు వెల్లడించారు. చిట్యాల మండలం చల్లగరిగె గ్రామంలో ఆన్‌లైన్ సెంటర్ నడుపుతున్న యువకుడు బండి దీక్షిత్.. నడికూడ మండలం పులిగిల్లకు చెందిన సంఘు కుమారస్వామి ఆటోలో ఈ నెల 23న ఇదే గ్రామానికి(పులిగిల్ల)చెందిన ఓ బాలికను పెళ్లి పేరుతో కిడ్నాప్ చేశారు. దీంతో బాలిక తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేయగా నిందితుల కోసం గాలిస్తున్నారు. ఈ క్రమంలో అదే ఆటోలో మూడు రోజుల తర్వాత పరకాలకు వస్తుండగా అంబేడ్కర్ జంక్షన్ వద్ద పోలీసులు పట్టుకున్నారు. పెళ్లి కోసం కిడ్నాప్ చేసింది వాస్తవమేనని నిందితులు ఒప్పుకోవడంతో అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ రవిరాజ్ తెలిపారు. కార్యక్రమంలో ఎస్సై రమేష్, సిబ్బంది పాల్గొన్నారు.

## అదుపు తప్పి ఆటో బోల్తా..

- దంపతుల మృతి
- ముగ్గురికి స్వల్ప గాయాలు



యాకూబ్,అమీనబీ దంపతులు (ఫైల్)

జఫర్‌గఢ్: అదుపు తప్పి ఆటో బోల్తా పడింది. ఈప్రమాదంలో దంపతులు మృతి చెందగా ముగ్గురు స్వల్పంగా గాయపడ్డారు. ఈ ఘటన ఆదివారం మండలంలోని సూరారంలో చోటు చేసుకుంది. ఎస్సై రవియాదవ్ కథనం ప్రకారం.. స్టేషన్‌ఘన్‌పూర్ మండలం శివునిపల్లికి చెందిన ఎండీ యాకూబ్ (80), అమీనబీ (70) దంపతులు ముగ్గురు బంధువులతో కలిసి సూరారంలో వివాహ వేడుకకు హాజరయ్యేందుకు ఆటోలో బయలుదేరారు. తీగారం మీదుగా సూరారం వస్తుండగా ఇదే గ్రామ శివారులో కల్వర్టు వద్ద ఆటో అదుపు తప్పి బోల్తా పడింది. ఈ ఘటనలో యాకూబ్, అమీనబీ దంపతులు తీవ్రంగా గాయపడగా ముగ్గురికి స్వల్ప గాయాలయ్యాయి. ఈ విషయం తెలుసుకున్న బంధువులు, స్థానికులు.. యాకూబ్, అమీనబీ దంపతులను వరంగల్ ఎంజీఎం తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందారు. ఈ ఘటనపై మృతుల కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రవియాదవ్ తెలిపారు.

## రైలు ఢీకొని వ్యక్తి మృతి



కరుణాకర్ (ఫైల్)

చిల్పూరు: రైలు ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన మండలంలోని మండలంలోని వంగాలపల్లిలో జరిగింది. ఘటనకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన చింత కరుణాకర్ (38) ఆటో నడుపుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఈ క్రమంలో శనివారం సాయంత్రం మామిడి కాయలు తీసుకొస్తానంటూ ఇంటి నుంచి వెళ్లాడు. గ్రామ సమీపంలో పట్టాలు దాటుతున్న సమయంలో గుర్తు తెలియని రైలు ఢీకొనడంతో మృతి చెందాడు. ఈ ఘటనపై రైల్వే పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు. మృతుడికి భార్య నిరీష, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

### రైలు నుంచి జారిపడి గుర్తు తెలియని మరో వ్యక్తి..

కాశిబుగ్గ/కేసముద్రం: రైలునుంచి జారిపడి ఓ గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. ఘటన కేసముద్రం – తాళ్లపూసలపల్లి రైల్వే స్టేషన్ల మధ్య రంగాపురం రైల్వే గేటు సమీపంలో ఆదివారం జరిగింది. జీఆర్పీ సీఐ నరేష్ తెలిపిన వివరాల ప్రకారం 40 – 45 ఏళ్ల వయసు గల వ్యక్తి ఎడమ చేతిపై నాన్న అని, కుడి చేతిపై అమ్మ అని పచ్చబొట్టు ఉందని తెలిపారు. ఆ మృతదేహాన్ని వరంగల్ ఎంజీఎం మార్చురీలో భద్రపరిచినట్లు వివరించారు. మృతుడి వివరాలకు 97017 47014, 87126 58585 నంబర్లలో సంప్రదించాలని జీఆర్పీ సీఐ నరేష్ కోరారు.


## సాక్షి క్లాసిఫైడ్స్

**REAL ESTATE**

**HOUSE FOR SALE**

■ ప్రిన్స్ రియల్‌ఎస్టేట్: వరంగల్ గొర్రెకుంటలో కీర్తినగర్ ప్రక్కన, RTC కాలనీలో గల 130 గజాలలో రేకుల ఇల్లు అమ్మబడును. ధర కేవలం 16 లక్షలు మాత్రమే. కీర్తినగర్ కాలనీలో ఇల్లు అమ్మబడును. మావద్ద ప్లాట్లు అమ్మబడును. సెల్: 9989388603. [W-1242468]

■ WGL, కొత్తవాడ, లక్ష్మి గార్డెన్స్ దగ్గర 182 గజాల E/F ఇల్లు G.F 1 BHK + 2 BHK, 1st ఫ్లోర్ 2 BHK + 2 BHK, 2nd ఫ్లోర్ 1 BHK పార్కింగ్ G.F. కార్ @ 3 bikes, 1 బోర్, WMC వాటర్ # 9490421153, 9652979107. [M-11664]

**SERVICES**

**CHANGE OF NAME**

■ I, NASREEN FATIMA, D/o. Mohammed Sagheer Uddin Muneer born on 13.03.1988, residing at H.No. 11-23-986, LB Nagar, Warangal, Telangana have changed my name to NASREEN FATHIMA vide affidavit dated 24.05.2024 at Warangal, Telangana. [W-1242474]

**BUSINESS OFFER**

■ వ్యక్తిగత, వ్యవసాయ, వ్యాపార, ప్రాపర్టీ కొరకు అతి తక్కువ వడ్డీతో రుణాలు ఇప్పించబడును. CIBIL అవసరం లేదు. NPA కూడా దరఖాస్తు. హన్మకొండ. సెల్: 8096520976. [WA-5706]

**WANTED**

■ హనుమకొండ, లష్కర్‌బజార్, పబ్లిక్ గార్డెన్ దగ్గర ఉన్న HP పెట్రోల్‌పంప్ నందు పెట్రోల్, డీజిల్ క్యాషియర్ & ఫిల్లర్స్‌గా ఫిల్లింగ్ పని చేయుటకు యువతీ యువకులు కావలెను. (8గం./12గం./24గం.) సంప్ర: 9505919293. [W-1200892]

4 లైన్ల క్లాసిఫైడ్ ప్రకటన 260/- రూ. అదనపు లైను 60/- రూ. మాత్రమే 5% GST అదనము

■ ప్రముఖ కంపెనీలో పార్ట్ టైం మాన్యువల్ రైటింగ్ వర్క్ చేయుటకు స్త్రీ/పు కావలెను. వీక్లీ పేమెంట్స్ 3500/- మీ పేరు, అడ్రస్ కాల్ /వాట్సప్ చేయగలరు. 9502615217. [M-1185087]

■ మహబూబాబాద్ జిల్లాలో వేప పిండి, ఆముదం పిండి అమ్ముటకు అర్జంటుగా ఏజెంట్లు కావలెను. ఆర్గానిక్ ఆయిల్స్ సేల్స్ కొరకు ఏజెంట్లు కావలెను. 7842728053. [Y-798453]

■ హరేకృష్ణ హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్/ నర్సులు కావలెను. ఉచిత వసతి+ భోజనం. జీతం: 18 K. Ph: 9640258899, 9640468899. [H-799885]

ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకై సంప్రదించండి

హన్మకొండ : 9010144453
వరంగల్ : 9705748198
నర్సంపేట : 9553955722
జనగామ : 9951602871
మహబూబాబాద్ : 9010144453
పరకాల : 9010299096
జయశంకర్ భూపాలపల్లి : 9705748198

**గమనిక**

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.